JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక

కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 280 30 శనివారం మే 2026 ఎడిటర్ గుంటపల్లిస్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5



## ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

**జనసైన్యం సిటి**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్ పై శిక్షణా కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రమేష్ బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ....1950 నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 సార్లు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో 2002 లో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్/ డూప్లికేట్ ఎంట్రీల తొలగింపు జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించనున్నట్లు చెప్పారు.జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హత ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.




ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీ.ఎల్.వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని, ఎన్యుమరేషన్ సమయంలో ఎలాంటి ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదని తెలిపారు.ప్రతి బీ.ఎల్.వో.కు ఎస్.ఐ.ఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డ్రాఫ్ట్ జాబితా విడుదల అనంతరం మ్యాపింగ్‌లో లోపాలు ఉంటే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 1, 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని, డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రుల ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు.




రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

ప్రైవేట్ వ్యక్తులు ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగించాలని, ఎన్నికల ప్రక్రియలో పూర్తిస్థాయి నిష్పాక్షికత పాటించాలని తెలిపారు. అన్ని పార్టీలకు సమాన దూరంలో ఉండటమే కాకుండా, అది స్పష్టంగా కనిపించేలా అధికారులు వ్యవహరించాలని ఆదేశించారు.

## సంక్షేమ పథకాలతో ప్రజల మనసు గెలిచాం

**జనసైన్యం సిటి**

సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం మరియు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షతన విడివిడిగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో చొప్పదండి నియోజకవర్గం, కరీంనగర్ కార్పొరేషన్ ముఖ్య నేతలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సమావేశాలకు మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంటు పిసిసి సమన్వయకర్త కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. S.I.R ఓటర్ మ్యాపింగ్ పై అవగాహన, BLA-2ల నియామకం, సంఘటన్ సృజన్ అభియాన్ కమిటీల పనితీరు, బూత్ స్థాయి బలోపేతంపై మండల, పట్టణ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులకు అనుబంధ సంఘాల అధ్యక్షులకు నాయకులకు నేతలు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరోసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జరుగుతున్న సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమాన్ని పరిశీలించడానికి పిసిసి సమన్వయకర్తగా విచ్చేసిన కూన శ్రీశైలం గౌడ్ గతంలో శాసన సభ్యులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా పనిచేసినారు, భారత ఎన్నికల సంఘం ఈ సమగ్ర ఓటర్ సవరణ పేరుతో కొత్తగా ఓటర్లుగా చేర్చడం అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఏదైనా కారణం తోటి వాళ్లను ఓటర్ జాబితా నుంచి తొలగించే కార్యక్రమాన్ని మన ఎన్నికల సంఘం చేపట్టింది చొప్పదండి నియోజకవర్గం పూర్తిగా గ్రామీణ ప్రాంతం, ఈ గ్రామంలో గాని ఏ బూతులు కానీ ఓటర్ ను తొలగించే కార్యక్రమం చాలా అరుదుగా జరుగుతుంది జరగకపోవచ్చు కూడా ఇది కేవలం కరీంనగర్ లాంటి నగర ప్రాంతాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది ఎందుకంటే వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది అలాగే బిజెపి వాళ్లు కొన్ని వర్గాల వారిని టార్గెట్ చేసుకొని వారిని తొలగించే కార్యక్రమం ముఖ్యంగా కరీంనగర్ హైదరాబాద్ లాంటి నగరాల్లో ఎక్కువ జరుగుతది మన గ్రామీణ ప్రాంతంలో దీని ప్రభావం ఉండకపోవచ్చు, అయినప్పటికీ కూడా మన గ్రామాల్లో మనమందరం కలిసి బిఎల్ఏ 2 ఏజెంట్లను నియమించుకున్నాము, ఈ సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని తమ ఓట్లు ఉన్నాయా లేదా గ్రామంలో అందరి ఓట్లు ఉన్నాయా లేకపోతే కొత్తగా చేర్పించడం లాంటి విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఈ ఓటర్ సవరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నాను. వెస్ట్ బెంగాల్ లాంటి కొన్ని సరిహద్దు రాష్ట్రాల్లో ఓటర్ సవరణ కార్యక్రమం చేపట్టడం ద్వారా బిజెపి అక్కడ విజయం సాధించారు, అట్లాంటి ప్రమాదం మన రాష్ట్రంలో మన నియోజకవర్గంలో చాలా తక్కువగా ఉంటుంది, రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలుగా కావస్తుంది, శ్రీ ఈ రెండున్నర సంవత్సరంలో గతంలో పరిపాలించిన బిఆర్ఎస్ పార్టీ 9 సంవత్సరాలు ఈ రాష్ట్రంలో ఏ ఒక్క పేదోడికి కూడా న్యాయం చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది, దాదాపు ఆరు ఏడు లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్ర మొత్తం ఆర్థికంగా దివాళా తీసినటువంటి పరిస్థితి నెలకొంది, అయినప్పటికీ కూడా రేవంత్ రెడ్డి గారి ముఖ్యమంత్రి గా ముఖ్యంగా రైతాంగం సంక్షేమం కోసం రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్న 90శాతం రైతులకు రుణమాఫీ చేయడం జరిగింది, ఈ దేశంలో ఏ రాష్ట్రం ఏ పార్టీ చేయని గొప్ప పని మన తెలంగాణ ప్రభుత్వం చేసింది. ధాన్యం కొనుగోలు విషయంలో కలాలలో ఒక్కొక్క రైతు వద్ద అదనపు తూకంతో నాలుగు కిలోలను దోచుకున్నారు, ఇప్పుడు వారు మళ్ళీ కొత్తగా రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ రైతులను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు, కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జిపిఎస్ విధానంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పది రోజులు ఆలస్యం జరిగింది, మూడు సంవత్సరాల పంటలను ఎఫ్సీఐ ధాన్యం గోదాముల నుండి తీసుకోకపోవడం వల్ల ధాన్యం సేకరించే విషయంలో ఆలస్యం జరిగింది, ఈ విధమైన కారణాలు తప్ప ఎక్కడా రైతులను మోసం చేసే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదు గత ప్రభుత్వం రైతులను ఏ విధంగా మోసం చేసిందో కాంగ్రెస్ పార్టీ రైతులను ఏ విధంగా ఆదుకుంటుందో విజ్ఞులైన రైతులకు తెలుసు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక సన్న వడ్లు పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరిగింది, గడిచిన రెండు సంవత్సరాలలో 1,60,000 కోట్ల రూపాయలు వ్యవసాయ రంగానికి ఖర్చు పెట్టి రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచింది రేవంత్ రెడ్డి సర్కార్, మన ప్రభుత్వంలో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు ఇవ్వగా దాదాపు 80 శాతం ఇల్లు పూర్తి అవుతున్న దశలో ఉన్నాయి, కొన్ని ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు మనసుకు చాలా ఆనందంగా ఉంటుంది, ప్రతి ఇంటికి అర్హులైన ప్రజలకు తెల్ల రేషన్ కార్డు అందించాము 20 యూనిట్లలో ఉచిత విద్యుత్ అందించడం ద్వారా దాదాపు ప్రత్యక్షంగా పరోక్షంగా 1500 రూపాయలు ఆర్థిక లాభం అందజేస్తున్నాము, మహిళా ఆడపడుచులకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించాము, రెండున్నర సంవత్సరాలలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాము ఈ విధంగా అభివృద్ధి సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ప్రజలందరూ విశ్వసిస్తున్నారు అని అన్నారు.టిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ద్వారా వందల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతూ కాంగ్రెస్ పార్టీ పై విష ప్రచారం చేస్తుంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలే స్టార్ క్యాంపెనియర్లుగా పనిచేస్తూ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి .మరోసారి ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది మండల స్థాయిలో నియోజకవర్గ స్థాయిలో జిల్లా స్థాయిలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుంది ఆ బాధ్యత మేము తీసుకుంటాము.




ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ తక్కువైంది కాంగ్రెస్ పార్టీ వారు కాంగ్రెస్ పార్టీ వారి పైనే విమర్శలు చేసుకుంటున్నారు, మనమంతా ఒక కుటుంబం చిన్న చిన్న భేదాలు ఉంటే సరిదిద్దుకోవాలి. మన పోరాటం మన యుద్ధం మన ప్రతిపక్షాలైన బిజెపి బిఆర్ఎస్ పార్టీలపై చేయాలి.

రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రిని చేసే లక్ష్యంతో ప్రతి నాయకుడు కార్యకర్త పనిచేయాలి, ఎందుకంటే దేశంలో దౌర్భాగ్యమైన పరిస్థితులు ఉన్నాయి పెట్రోల్ డీజిల్ రేట్లు నిరుద్యోగ సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయి.ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఏ ఒక్క ఓటరును కూడా తొలగించకుండా 18 సంవత్సరాలు నిండిన యువకులను కొత్త ఓటర్లుగా చేర్పించే ప్రక్రియలో భాగస్వాములు కావాలని అన్నారు.

కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే సోనియాగాంధీ రాహుల్ గాంధీ S.I.R పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేంద్ర ఎన్నికల కమిషన్ ను ముందు పెట్టి కాంగ్రెస్ పార్టీ అనుకూల ఓటర్లను తొలగించే ప్రక్రియ చేపడుతుందని దానిపై ప్రతి పౌరునికి అవగాహన అవసరమని అన్నారు, కేవలం బిఎల్ఎ 2 లపై బాధ్యతను పెట్టకుండా ప్రతి బూతు నుండి కనీసం ఐదుగురు పార్టీ సభ్యులు బాధ్యత తీసుకొని కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్ పార్టీ ఓటర్లను కాపాడుకునే విధంగా ఓటర్ మ్యాపింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరినారు. ఇలాంటి సాంకేతిక సమస్యలు ఉన్న మన పార్టీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధుల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలి, పార్టీ సంస్థాగత నిర్మాణ విషయంలో కూడా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మరెన్నో నిర్మాణాత్మక చర్యలు తీసుకోబడతాయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వారి చేస్తున్న కృషిలో మనమంతా భాగస్వామ్యం కావాలని అన్నారు.కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో S.I.R ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో బిఎల్ ఏ 2 ల నియామకం పూర్తయిందని త్వరలోనే వారికి శిక్షణ తరగతులు నిర్వహించే విషయం లోపల ఇప్పటికే అవగాహన కల్పించామని, ఏఐసీసీ పీసీసీ ఆదేశాల మేరకు నగరంలో ఎన్నికల అధికారులు చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీకి నష్టం కలిగించే విషయాన్ని కూడా నిర్లక్ష్యం చేయకుండా పార్టీ ఇస్తున్న సూచనలను ఆదేశాలను పాటిస్తున్నామని వైద్యుల అంజన్ కుమార్ గారు పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశాలలో నాయకులు పిసిసి ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్, పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, బానోతు శ్రవణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, పురం రాజేశం, వెన్నం రజిత రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జవ్వాజి హరీష్, సువిన్ యాదవ్, మహేందర్ మంత్రి, నాయకులు అబ్దుల్ రెహమాన్, కోల రమేష్ , పురుమల్ల మనోహర్, ముద్దం తిరుపతి గౌడ్, సిరిపురం లావణ్య నాగప్రసాద్, గంట శ్రీనివాస్, పర్వతం మల్లేశం, గుమ్మడి రాజకుమార్, ఫహాద్, మూల కృష్ణారెడ్డి, కపిల్ మాధవ్, ముస్తాక్, నూనె గోపాల్ రెడ్డి, పెంట శేఖర్, మరియు కార్పొరేటర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరైనారు.

# కాబోయే అల్లుడు గురించి ఆరా



**జనసైన్యం సిటి**

ఆంధ్రప్రదేశ్ లో పెళ్లి సంబంధానికి అటూఇటూ 7 తరాలు చూడాలని పెద్దలు అంటుంటారు. కానీ కాకినాడలో ఓ తండ్రి తన కూతురికి కాబోయే భర్త వ్యక్తిత్వం, సమాజం పట్ల అవగాహన గురించి తెలుసుకోవాలనుకున్నారు. అతడి ఆధార్, ఫోన్ నంబర్, కారు, బైక్ నంబర్లు తీసుకొని ట్రాఫిక్ CIని కలిశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, ట్రాఫిక్ ఉల్లంఘనల గురించి ఆరా తీశారు. పరిశీలించి పెండింగ్ చలానాలేవీ లేవని చెప్పిన CI.. ఆ తండ్రిని అభినందించారు.

## డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన నల్ల వెంకటరెడ్డికి స్వాగతం



**జనసైన్యం సిటి**


కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తాసిల్దార్ నుండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన నల్ల వెంకటరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా మరియు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వకంగా స్వాగతం తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారిని నాయకులు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదోన్నతులు అందుకోవాలని, అలాగే ప్రభుత్వ పరిపాలనలో ప్రజలకు మరియు ఉద్యోగులకు మరింత సేవలు అందించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీ చరణ్ గౌడ్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డం సుధాకర్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పెండ్యాల కేశవరెడ్డి, కార్యదర్శి ఎలదాసరి లింగయ్య, మహిళా చైర్మన్ ఇరుమల్ల శారద, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట రామస్వామి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్, నాయకులు గోవిందపతి శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన అధికారులకు ఘన సన్మానం



**జనసైన్యం సిటి**

వాసుదేవా హాస్పిటల్ మరియు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో, ప్రజాసేవలో విశిష్ట సేవలందిస్తూ ఇటీవల పదోన్నతులు పొందిన అధికారులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పెద్దపెల్లి ఆర్డీఓగా పదోన్నతి పొందిన శ్రీమతి రాజేశ్వరి గారిని, సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన శ్రీ వీర తిరుపతి ని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమం కరీంనగర్ భగత్‌నగర్‌లోని ఆర్డీఓ స్వగృహంలో జరిగింది. డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులను గుర్తించి సన్మానించడం అలయన్స్ క్లబ్ యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటని తెలిపారు. పదోన్నతి పొందిన అధికారులు ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. అలాగే స్వదేశీ సేవా సంస్థ అయిన అలయన్స్ క్లబ్‌లో చేరాలని ఆహ్వానించగా, వారు సంతోషంగా అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొంజర్ల మహేష్ (జిల్లా గవర్నర్), పుల్లల శ్యామ్, సుద్దపెల్లి ప్రసాద్ (V D G - 1), సాగర్ రెడ్డి (V D G - 2), పండుగ నాగరాజు (D C S), సుధాకర్, ఆనంద్ శర్మ (ZC), ఇంజనీర్ కొల అన్నారెడ్డి, ఇంజనీర్ ఈద కుమారస్వామి, నాగేశ్వర్, వెంకటేశ్వర్లు మరియు పలువురు పీడీజీలు పాల్గొన్నారు.




## అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధముగా ర్యాంక్ ఫోర్డ్ అకాడమీ

**జనసైన్యం సిటి**

అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధముగా ర్యాంక్ ఫోర్డ్ అకాడమీ పేర్లతో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేపడుతున్న ఇట్టి యజమానులపై క్రిమినల్ కేసు ను మోదు చేయాలి . కోచింగ్ సెంటర్లు కరీంనగర్ జిల్లా డి.ఈ.ఓ. కార్యాలయము నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇంటర్ మరియు IIT, JEE, NEET పేర్లతో కోచింగ్ సెంటర్లు నిర్వహించడమే కాకుండా, తెలంగాణ ఇంటర్ బోర్డు వారి నుండి కూడా ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటర్ అడ్మిషన్లు చేపడుతున్నారని, ఇట్టి విషయమై గతంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కేవలం పత్రికా ప్రకటనతో సరిపెట్టారని తెలియజేస్తూ ఇట్టి అనుమతి లేని కోచింగ్ సెంటర్ల వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే పరిస్థితి ఉన్నందున దీనిపైన సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు మరియు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి తగు చర్యలు తీసుకొనే విధంగా తమరు ఆదేశాలు జారీ చేయాలని అఖిల భారత యువజన సమైఖ్య తరుపున కోరుచున్నాము.



ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి
భావండ్ల పెళ్లి యుగంధర్









## కరీంనగర్ నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రస్థానం



జనసైన్యం సిటి

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించే దిశగా నగర పాలకవర్గం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా కరీంనగర్ నగరంలోని 38, 39వ డివిజన్లలో పలు ప్రతిష్టాత్మక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు మరియు శంకుస్థాపన కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు.

ఈ విశేష కార్యక్రమాలకు కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు,బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ మరియు మాజీ మేయర్ శ్రీ యాదగిరి సునీల్ రావు గారు ముఖ్య అతిథులుగా విచ్చేసి పనులను ప్రారంభించారు. లి38వ డివిజన్ పరిధిలో కాలనీ వాసుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ,కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (C.S.R) ఫండ్స్ తీసుకు రావడం జరిగింది ఇందులో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన 'ఓపెన్ జిమ్'ను ముఖ్య అతిథులు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక ప్రజలు, యువత, వృద్ధులు వ్యాయామం చేస్తూ శారీరక ధృడత్వాన్ని పెంచుకునేందుకు ఈ ఓపెన్ జిమ్ ఎంతో దోహదపడుతుంది మరియు రూ. 10.80 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ (CC) రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

అనంతరం 39వ డివిజన్ లో పర్యటించిన రూ. 10 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు మరియు కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో38వ డివిజన్ కార్పొరేటర్ దేవసాని సరస్వతి-సత్యనారాయణ ,39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ ,49వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి ఎన్నం లక్ష్మి-ప్రకాష్ , 47వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి గాజ రామ-శివరాం , 37వ డివిజన్ కార్పొరేటర్ శ్రీ కె. ఎపిపి చంద్ర గారు పాల్గొన్నారు ఈ శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది,మహిళలు, యువత మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పత్తికుంటపల్లిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



ఇల్లంతకుంట మండలంలోని పత్తికుంటపల్లి గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ జుట్టు శేఖర్ శుక్రవారం ప్రారంభించారు. 120 మీటర్ల పొడవుతో సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో ఈ సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు.గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగానే ఈ పనులు చేపడుతున్నామని సర్పంచ్ జుట్టు శేఖర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్, ఉప సర్పంచ్ మనోహర్ రెడ్డి, ఏఈ రాజేష్, గ్రామ కార్యదర్శి సాయి సుధ, వార్డు సభ్యులు,భారతి,పూజ,రాజమణి, రవి. భాస్కర్,చింతాలపల్లి చిన్న శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ ,రమణ రెడ్డిలు. తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం



**జనసైన్యం సిటి**

నాలుగు పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం అవుతున్నట్లు జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల విద్యాధికారి బండారి మధు శుక్రవారం సుచించారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించింది. మండలంలో గత సంవత్సరం నాలుగు ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించగా ప్రభుత్వం కొత్తగా ఈ సంవత్సరం ఎంపీహెచ్ఎస్ కోజన్ కొత్తూరు, ఇబ్రహీంపట్నం, గోదురు , తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను మంజూరు చేసినట్టు మండల విద్యాధికారి తెలిపారు.ఈ ప్రీ ప్రైమరీ తరగతుల కొరకు పాఠశాలలో ప్రత్యేకంగా ఒక తరగతి గదిని కేటాయించడం తో పాటు వాటిలో రంగురంగుల బొమ్మలు, చాట్స్, ఆట వస్తువులు,ఫర్నిచర్ కూడా ప్రభుత్వం సమకూరుస్తుందని వారు తెలపడం జరిగింది. అదేవిధంగా అవసరమైన ఉపాధ్యాయులను , ఆయాలను కూడా ప్రభుత్వం నియమిస్తుందన్నారు.తల్లి తండ్రులు తమ పిల్లలను ఆయా పాఠశాలల్లో నీ ప్రీ ప్రైమరీ తరగతుల్లో చేర్పించాలని ఎంఇఓ కోరారు.





# భారతీయ జర్నలిజం ఆద్యుడు జుగల్ కిషోర్ శుక్లా

## (30 మే "హిందీ జర్నలిజం దినోత్సవం" సందర్భంగా)

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

రెండు దశాబ్దాలకు పూర్వం ఆంగ్లం, పార్సియన్ లాంటి భాషల్లో మాత్రమే పాఠకులకు పత్రికలు అందుబాటులో ఉండేవి. హిందీ భాష అత్యధికంగా మాట్లాడే భారతంలో నాడు హిందీలో పత్రికలు ఉండేవి కాదు. ఈ లోటును గ్రహించిన కాన్పూర్‌కకు చెందిన పండిట్ జుగల్ కిషోర్ శుక్లా 30 మే 1826 రోజున కొల్‌కతాలో తొలిసారిగా "ఉదంత్ మార్తాండ్ (ఉద్యమించే సూర్యుడు)" అనే వార పత్రికను అందుబాటులోకి తేవడంతో భారతీయ భాషల్లో పత్రికల విప్లవం ప్రారంభమైంది. ఈ మహత్తర సంఘటనకు గుర్తుగా ప్రతి ఏట 30 మే రోజున "హిందీ జర్నలిజం దినోత్సవం (హిందీ జర్నలిజమ్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ఈ వేదిక ఆధారంగా హిందీ జర్నలిస్టులు, ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్లు, కరస్పాండెంట్లు లాంటి వర్గాల త్యాగాలు, అంకితభావాలను గుర్తు చేసుకోవడంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలు సహితం కోల్పోయిన వారికి నివాళులు అర్పించడం జరుగుతుంది. నేటి హిందీ జర్నలిజం దినోత్సవానికి ఓ ప్రత్యేకత ఉంది. రెండు శతాబ్దాల హిందీ జర్నలిజం ఘన చరిత్రను నేడు పాఠకులు గుర్తు చేసుకునే శుభ సందర్భంగా జరుపుకోవాలి.

**చిన్న ప్రయత్నం ఓ పెద్ద విప్లవానికి నాంది:**

నాడు హిందీ పాఠకులు తక్కువగా ఉండడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కేవలం 79 వారాలు మాత్రమే పత్రికలను విడుదల చేసి ఆ తర్వాత ఆపి వేయడం జరిగింది. అయినప్పటికీ నాడు జుగల్ కిషోర్ శుక్లా నాటిన చిన్న హిందీ పత్రిక బీజం కాలక్రమంలో విస్తరించి నేడు పాఠకులకు అనేక రకాలైన పత్రికలు, ఆన్‌లైన్ పత్రికలు, టీవీ చానెల్స్ లాంటివి అందుబాటులోకి రావడం జరిగింది.

పత్రిక అంటే సమాచార వితరణ మాత్రమే కాదని, ఇవి ప్రజలను ఏకం చేసే శక్తివంతమైన మాధ్యమాలని, సమస్యలను పరిష్కరించే వేదికలని తెలుసుకోవాలి. నేటి పత్రికలు మానవ హక్కులు, సజావుగా ఎన్నికల నిర్వహణ, విద్య, సమకాలీన అంశాలు, రాజకీయం, సామాజిక సమస్యలను బహిరంగ పరిచే వేదికలుగా అమూల్య సేవలను అందిస్తున్నాయి.

**డిజిటల్ స్మార్ట్ యుగంలో పత్రికల మనుగడ:**

1826లో ప్రారంభమైన తొలి హిందీ పత్రిక తర్వాత దినదినం అభివృద్ధి చెందుతూ నేడు వందల, వేల పత్రికలు అందుబాటులోకి వచ్చాయి దైనిక్ జగరన్, అమర్ ఉజాల, హిందూస్థాన్, రాజస్థాన్ పత్రిక లాంటివి అనేకం పాఠకులకు సమాచార, విద్య, విజ్ఞాన, సామాజిక చైతన్య విందులను వడ్డిస్తున్నాయి. 1990ల్లో హిందీ టీవీ చానెల్స్ అందుబాటులోకి రావడం, తర్వాత యూట్యూబ్ చానెల్స్, మొబైల్ ఆప్‌లు లాంటి రావడంతో నేడు అరచేతిలో అన్ని పత్రికలు ఇమిడిపోయాయి. హిందీ జర్నలిజం దినం వేదికగా యూనివర్సిటీలు, పత్రికా సంస్థలు, ప్రెస్ క్లబ్‌లు, పాఠక సంఘాలు పలు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. డిజిటల్ ఏఐ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న వేళ నేడు పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతూ పలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి.

నీతి నిజాయితీ, జవాబుదారీతనం, ప్రజా సేవ అనే పునాదుల మీద జర్నలిజం నిలబడాలి. పత్రికలు పక్షపాతంతో దారి తప్పితే ప్రజలకు భారీ నష్టం జరుగుతుంది. చీకటిలో బతుకుతున్న అభాగ్యుల జీవితాల్లో పత్రికలు వెలుగులు నింపాలి. ప్రతి వార్తను క్షణాల్లో అందిస్తున్న డిజిటల్ విప్లవంతో పత్రికల మనుగడ మసకబారరాదు. పత్రికల ప్రాధాన్యాన్ని ప్రత్యామ్నాయం లేదని గమనించాలి. పత్రికలు పోషించడానికి ప్రజలు పాఠకులుగా మారి ముందుకు రావాలి.






# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త




బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును బుకింగ్ చేసుకోవాల్సిన

ఫోన్ నెంబర్

9246966660








## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి

రాత్రి 10 గంటల వరకు

మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

**ఆట వేళలు**

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660









జనచిత్రం



గీకురు హైందవికి జన్మదిన శుభాకాంక్షలు




సహదేవ్ రామ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు



మానస రాజు దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

# ప్రధానోపాధ్యాయుల హక్కులు మూడేళ్లుగా చీకట్లోనే మగ్గుతున్నాయి

**జనసైన్యం సిటి**

అది జిల్లా విద్యా దీపాలను వెలిగించాల్సిన విద్యాశాఖ కార్యాలయం. కానీ అక్కడ పని చేసే ప్రధానోపాధ్యాయుల హక్కులు మాత్రం మూడేళ్లుగా చీకట్లోనే మగ్గుతున్నాయి. వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరవుతాయి.. కానీ సర్వీస్ రిజిస్టర్లలో నమోదు కావు. ఆర్జిత సెలవుల ప్రిజర్వేషన్ కాగితాలకే పరిమితం.. ఎస్ఆర్‌లలో నో ఎంట్రీ! సరెండర్ లీవ్ మంజూరే గగనం.. ఒకవేళ పొరపాటున శాంక్షన్ అయినా రిజిస్టర్లలో ఎంట్రీలు ఉండవు. ఇది కరీంనగర్ జిల్లా సరిహద్దు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గత మూడేళ్లుగా సాగుతున్న దారుణమైన నిర్వాకమిది.

సాధారణంగా టీచర్లు ఏ చిన్న తప్పు చేసినా మెమోలు, సస్పెన్షన్లతో విరుచుకుపడే జిల్లా విద్యాశాఖాధికారులే ఈ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారడం గమనార్హం. ఈ దారుణానికి ఒడిగడుతున్నది ఎవరో కింది స్థాయి సిబ్బంది కాదు.. స్వయంగా జిల్లా విద్యాశాఖాధికారే (DEO) కావడం గమనార్హం. గత మూడేళ్లుగా హెచ్ఎంల సర్వీస్ రిజిస్టర్లలో ఎలాంటి ఎంట్రీలు లేవు, డీఈఓ సారు గారి సంతకాలూ లేవు.

**సొంతంగా రాసుకున్నా కనికరం సున్నా!**

కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయిన కొంతమంది హెచ్ఎంలు.. గత నెలలో స్వయంగా డీఈఓ ఆఫీసులోనే కొన్ని రోజుల పాటు కూర్చొని, తోటి ఉద్యోగులందరి సర్వీస్ రిజిస్టర్లలో ఎంట్రీలను కష్టపడి పూర్తి చేశారు. కేవలం డీఈఓ సారు గారు పెన్ను తీసి సంతకం పెడితే ఆ పనైపోతుంది. కానీ, సారు గారు మాత్రం కనికరం చూపడం లేదు. సంతకాలు పెట్టకుండా కాలయాపన చేస్తూ భీష్మించుకు కూర్చున్నారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లను డిజిటలైజేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ తరుణంలో ఎస్ఆర్‌లలో ఎంట్రీలు, అధికారుల సంతకాలు లేకపోవడంతో ఆ జిల్లాలోని హెచ్ఎంలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా ఉండాల్సిన డీఈఓనే ఇంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగునా? ఉద్యోగ, ఉపాధ్యాయులు తప్పులు చేస్తే కొరడా ఝుళిపించే ఉన్నతాధికారులు ఈ డీఈఓ సారు గారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారా? 'జస్ట్ ఆస్కింగ్'!



మానేటి ప్రతాపరెడ్డి.

# డేవిడ్ రెడ్డి సినిమాని నిలిపి వేయాలి




కరీంనగర్ లోని సిపి కార్యాలయంలో సిపి గౌస్ అలం గారిని కలిసి డేవిడ్ రెడ్డి సినిమాలో మా రెడ్డిల మనోభావాలను కించపరిచే విధంగా ట్రైలర్లో మా రెడ్డిలను ఒక విలన్ లాగా చూపిస్తూ రెడ్డిలను కించపరిచే విధంగా డైలాగులు ఉన్నాయని కావున ఈ సినిమాను విడుదలకు ముందే అందులోని రెడ్డిలను కించపరిచే విధంగా ఉన్న దృశ్యాలను తొలగించాలని లేకుంటే సినిమా అలాగే రిలీజ్ చేసినట్లయితే డేవిడ్ రెడ్డి సినిమాని తెలంగాణ వ్యాప్తంగా అడ్డుకుంటామని కావున సినిమా పేరుని తొలగించాలని సిపి గారిని కలవడం జరిగింది

ఈ కార్యక్రమంలో, తెలంగాణ రెడ్డి సంఘం పెద్దపెల్లి జిల్లా ఆడ్ హాక్ కమిటీ ఇన్చార్జ్ చిగిరి సతీష్ రెడ్డి మరియు తెలంగాణ స్టేట్ రెడ్డి యూత్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోమటిరెడ్డి అశోక్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేష్ రెడ్డి హాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పట్టణంలోని సర్వే నెం :53 లోని స్మశాన వాటికను కబ్జా నుండి రక్షించండి.




కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్ , వ్యవసాయ మార్కెట్ ఏరియా పరిధిలో సర్వే నెం. 53లోని ప్రభుత్వ భూమిని, స్మశాన వాటికను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, సర్వే నెం. 53 పూర్తి విస్తీర్ణం కొలిపించి, కబ్జా చేసిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని స్మశాన వాటికకు అప్పగించాలని ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, 27 డివిజన్ కార్పొరేటర్ బోట్ల శ్యామల తంగేళ్ల కిరణ్ కుమార్ ఆర్డీవో గారిని కలసి విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలోని ప్రభుత్వ భూమి సర్వే నెం. 53 కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కబ్జా చేసి గోడలు నిర్మించి గేట్లు పెట్టుకుంటే రెవిన్యూ, మున్సిపల్ అధికారులు మొద్దు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. గత 50 సంవత్సరాలుగా అంబేద్కర్ నగర్, 27వ డివిజన్ కాలనీ వాసులు ఎవరైనా చనిపోతే స్మశాన వాటికకు తీసుకువెళ్లడానికి, మళ్లీ రావడానికి ఈ (దారిని) రోడ్డును ఉ పయోగించేవారు. చివరికి రోడ్డును కబ్జా చేసి గేట్లు పెట్టడం కందుకలు తియ్యడం జరిగిందని అన్నారు. అధికారులు కబ్జాదారులతోకుమ్మకు అయ్యారని ఆరోపించారు. గత రెండు సంవత్సరాలుగా కొంతమంది వ్యక్తులు పట్టా సర్వే నెంబర్ తో ప్రభుత్వ భూమి 53 సర్వే నెంబర్ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని స్మశాన వాటికను , వెళ్లే దారిని గోడలు నిర్మించి గేట్లనునిర్మించిన అధికారులు మాత్రం పట్టణట్లు వ్యాహరించడం అన్యాయమని అన్నారు. అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదురకొంటున్నారని అన్నారు. గతంలో కూడా అంబేద్కర్ నగర్ కాలనీవాసులు జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకువచ్చినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే సర్వే నెం. 53ను పూర్తి విస్తీర్ణం కొలిపించి కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అంబేద్కర్ నగర్ కాలనీ వాసులకు న్యాయం చేయాలనీ కోరారు. లేదంటే ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్మశాన వాటికను సందర్శన చేసి గేట్లు బద్దాలు కొడుతామని హెచ్చరించారు.



దేవ వినయ్ మాళవిక దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

## ఆసిఫాబాద్ జిల్లాలోని రాంపూర్ లో నేతకానీ కుల సమావేశం ఏర్పాటు



**జనసైన్యం సిటి**

ఈ సమావేశం ను ఉద్దేశించి పలువురు నేతకానీ కుల పెద్దలు ఈ విధంగా మాట్లాడాటం జరిగినది . ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నలుమూలల ప్రాంతాలనుండి బంధాలు బంధుత్వాలు ఏర్పాటుచేసుకోవడం. పూర్వం నుండి ఏర్పాట్లు చేసుకోవడం జరుగుతుంది. ఇంటిపేర్లు ఒకే విధంగా ఉంటాయి నేతకానీ కులాతులకు ప్రతేకంగా ఏడ్ల పొలాల పండుగను ఎంతో శ్రేష్ఠంగా భక్తి శ్రద్దలతో జరుపుకోవడం నేతకానీ కులం ఆచారం . మాకులానికి వృత్తి దొడ్డు బట్టలు నేయడం అప్పుడైతే నూలు వస్త్రాలు మార్కెట్స్ వచ్చినాయో మా బట్టలకు గిరాకీ లేకుండా పోయినది. చాలామంది ఇరు గ్రామాల పెద్దలు మా గ్రామమములో కూడామా తాతలు దొడ్డు బట్టలు వేసే వారే మాకు చెప్పేవారు అన్ని పలువురు కుల పెద్దలు చెప్పినారు.నేతకానీ కులం రాష్ట్ర ప్రభుత్వం. కేవలం 1.70000/-వైలు మాత్రమే చూపెడుతున్నారు.. మన జనాభా దాదాపుగా రాష్టవ్యతంగా 14.లక్షలకు పైబడి ఉంట్టునది మనము రిజర్వేషన్ పొందడంలో రిజర్వేషన్ లను కొలిపోతున్నాము జనాభాను తకవగా గ చూపెట్టుట వాలన రిజర్వేషన్ కొలిపోతున్నాం పిల్లలకు స్కూల్స్.ఉద్యోగాలు రావడం లేదు. ఆసిఫాబాద్. నియోజకవర్గం మరియు కాగజనగర్ నియోజకవర్గం లో మన జనాభా అత్య అధికంగా వున్నది. కుల సర్టిఫికెట్ మాల. మహర్ అనీ తీసుకోవడం వలన జనాభా కులగననలో నేతకానీ కులం తకవగా చూపెడుతున్నారు కుల గణనలో మాత్రం నేతకానీగా నమోదు చేసుకోవాలి ప్రతి నేతకానీ కుటుంబం.. మన జనాభా తగ్గట్టుగా రాష్ట్ర వ్యాప్తంగా 14లక్షల పైబడి చూపెడుతే. మనకు జనాభాకు అనుకులంగా రిజర్వేషన్ పొందూతం కాగజనగర్ నియోజకవర్గం లో మన ఓట్లు దాదాపుగా 40000/-వెలకు పైచింకుల ఓట్లు ఉంటాయి . ప్రభుత్వం చిన్న పొటపాటు చేసి ప్రభుత్వం గజిట్ లో నేతకానీ అని పొందు పరిచకుండా . మాల సాలె. అన్ని పందుపార్చడం జరిగినది మనకు నేతకానీ అనీ ప్రభుత్వం గిజిట్ లో అచ్చు తప్పులు లేకుండా నమోదు చేయాలి . గ్రామములోని కుల పెద్దలతో మాట్లాడి నేతకానీ అనీ కుల సర్టిఫికెట్ తీసుకోవాలి మన జనాభాను న్యాయభద్ధంగా నమోదు చూసుకోవాలి.ఈ కార్యక్రమం లో కార్తీక్ , రాజేష్ ,బోర్కర్ సుమన్ , మల్లేష్ దొంగ్రే. వెంకటేష్ వివిధ గ్రామ ల కుల పెద్దలు పాలుగొనడం జరిగినది.

## వానకు నానిన వడ్లు మక్కలు కోతలు లేకుండా కొనుగోలు చేయండి



**జనసైన్యం సిటి**

ఈదురు గాలులకు ఇండ్లు కూలిన కుటుంబానికి లక్ష రూపాయల నష్టపరిహారాన్ని అందించండి . మన గన్నేరువరం మండల గ్రామాల్లో పకృతి వైపరీత్యా వడగండ్ల వాన ఈదురు గాలులు వచ్చి రైతులను ప్రజలను చాలా నష్టం చేసి పోయినది . రైతులు పండించిన పంటలు వారి మక్కా వానకు తడిసిన వడ్లు మక్కలను రైతులను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా నానిన పేరుతో ఎలాంటి కోతలు (కటింగ్) చేయకుండా వడ్లు మక్కలు తొందరగా కొనుగోలు చేయండి... వాన ఈదురు గాలుల ద్వారా గ్రామాల్లో రేకుల ఇండ్లు గున ఇండ్లు కూలిపోయిన వారి కుటుంబానికి లక్ష రూపాయలు నష్టపరిహారం వెంటనే అందించి వారి కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.. జిల్లా అధ్యక్షులు. బామండ్ల రవీందర్ జిల్లా కార్యదర్శి. మాషం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# "సీబీఎస్ఈ" పరీక్షల నిర్వహణలో అవకతవకలు -విద్యార్థుల ఆందోళన



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్

దేశంలో విద్యా వ్యవస్థ అంటే ఒకప్పుడు నమ్మకం, క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రతీకగా భావించేవారు. ముఖ్యంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పరీక్షలను అత్యంత ప్రమాణాలతో నిర్వహించే వ్యవస్థగా దేశవ్యాప్తంగా గుర్తింపు ఉండేది. కానీ ఇటీవల సంవత్సరాల్లో వరుసగా వెలుగులోకి వస్తున్న ప్రశ్నాపత్రాల లీకులు, మూల్యాంకనంలో లోపాలు, ఫలితాల ఆలస్యం, సాంకేతిక వైఫల్యాలు, విద్యార్థుల మానసిక ఒత్తిడి, అసమానతల ఆరోపణలు వంటి పరిణామాలు ఈ వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థలోనే గందరగోళం, అవ్యవస్థ, నిర్లక్ష్యం చోటుచేసుకోవడం కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, ఇది కోట్లాది విద్యార్థుల జీవితాలతో జరుగుతున్న ప్రమాదకర ప్రయోగంగా మారింది.

సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణపై వచ్చిన విమర్శల్లో ప్రధానంగా ప్రశ్నాపత్రాల భద్రత అంశం పెద్ద చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లలో పదేపదే పేపర్ లీక్ ఆరోపణలు రావడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పరీక్షలకు నెలల తరబడి కష్టపడి చదివిన విద్యార్థులు పరీక్ష రోజు తమ కృషి విలువ కోల్పోతుందనే భయంతో మానసికంగా కుంగిపోతున్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రశ్నాపత్రాలు ముందుగానే వైరల్ అవుతున్నాయనే వార్తలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి. ఈ పరిస్థితి పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తోంది. ఒక దేశంలో అత్యున్నత విద్యా బోర్డు కూడా ప్రశ్నాపత్రాలను రక్షించలేకపోతే, ఆ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యంపై ప్రజలు ఎలా నమ్మకం ఉంచగలరు అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఇక మూల్యాంకన విధానంలో ఉన్న లోపాలు విద్యార్థులను మరింత అసహనానికి గురిచేస్తున్నాయి. చాలా మంది విద్యార్థులు తాము బాగా రాసినా అనుకున్న మార్కులు రాకపోవడం, రీ-వాల్యుయేషన్ తర్వాత భారీ తేడాలు బయటపడడం వంటి ఉదాహరణలు తరచూ కనిపిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులకు ఒకే సమాధానానికి వేర్వేరు మార్కులు రావడం, అంతర్గత మార్కుల విషయంలో పాఠశాలల మధ్య అసమానతలు ఉండడం విద్యా వ్యవస్థలో సమానత్వం లేదనే భావనకు కారణమవుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రతిభకు నిజమైన గుర్తింపు దక్కడం లేదని అనేక మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ యుగం పేరుతో కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో సాంకేతిక వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, వాటి అమలులో ఉన్న లోపాలు విద్యార్థులకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ఫలితాల విడుదల సమయంలో అధికారిక వెబ్‌సైట్లు పనిచేయకపోవడం, అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ కాకపోవడం, సర్వర్లు క్రాష్ అవడం వంటి సమస్యలు ప్రతి సంవత్సరం పునరావృతమవుతున్నాయి. దేశాన్ని "డిజిటల్ ఇండియా"గా మార్చుతున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ప్రాథమిక సాంకేతిక సదుపాయాలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సాంకేతికతను విద్యార్థుల సౌలభ్యం కోసం కాకుండా ప్రచార సాధనంగా మార్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సీబీఎస్ఈ పరీక్షల షెడ్యూల్, విధానాల్లో తరచూ మార్పులు చేయడం కూడా మరో పెద్ద సమస్యగా మారింది. ఒక సంవత్సరం ఒక విధానం, మరో సంవత్సరం మరో విధానం అమలు చేయడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. సిలబస్ తగ్గింపు, పరీక్షా నమూనా మార్పులు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ విధానాల్లో అనిశ్చితి విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. విద్యా విధానంలో స్థిరత్వం లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరింత వెనుకబడుతున్నారు. నగరాల్లో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు మాత్రం ఈ మార్పులకు తక్షణమే అనుగుణంగా కోచింగ్ వ్యవస్థలను సిద్ధం చేసుకుంటూ లాభపడుతున్నాయి. దీంతో విద్యా రంగంలో అసమానతలు మరింత పెరుగుతున్నాయి.

ముఖ్యంగా కోవిడ్ తర్వాత విద్యార్థుల మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఆ అంశాన్ని పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. పరీక్షల ఒత్తిడి, మార్కుల పోటీ, ప్రవేశ పరీక్షల భయం వల్ల విద్యార్థుల్లో ఆందోళన, నిరాశ, ఆత్మహత్యల ప్రవణత పెరుగుతున్నాయని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థులకు కౌన్సెలింగ్ సదుపాయాలు, భావోద్వేగ సహాయం, పరీక్షా ఒత్తిడి నిర్వహణ వంటి అంశాల్లో సరైన చర్యలు కనిపించడం లేదు. విద్యను మానవీయ దృక్పథంతో చూడకుండా కేవలం ర్యాంకులు, శాతాలు, పోటీ మార్కెట్ కోణంలోనే ప్రభుత్వం చూస్తోందనే విమర్శలు బలపడుతున్నాయి.

సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో ప్రైవేటీకరణ ప్రభావం కూడా పెరుగుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోచింగ్ సెంటర్ల ఆధిపత్యం, కార్పొరేట్ పాఠశాలల వ్యాపార ధోరణి వల్ల సాధారణ కుటుంబాలకు విద్య భారం అవుతోంది. పరీక్షల విధానం కూడా కోచింగ్ ఆధారితంగా మారుతోందనే విమర్శలు ఉన్నాయి. గ్రామీణ విద్యార్థులు, పేద కుటుంబాల పిల్లలు, ప్రాంతీయ భాషా మాధ్యమ విద్యార్థులు ఈ పోటీలో వెనుకబడుతున్నారు. సమాన విద్యా అవకాశాలను కల్పించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.





విద్యార్థుల నిరసనలు, తల్లిదండ్రుల ఆందోళనలు, విద్యావేత్తల విమర్శలు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తరచూ సమస్యలను చిన్నచూపు చూస్తోందనే భావన ఉంది. తప్పిదాలు జరిగినప్పుడల్లా "దర్యాప్తు చేస్తాం", "వ్యవస్థను బలోపేతం చేస్తాం" అనే ప్రకటనలు అయితే వస్తున్నాయి కానీ, ఆచరణలో పెద్ద మార్పులు ఏమీ కనిపించడం లేదు. బాధ్యత వహించాల్సిన అధికారులు అరుదుగా మాత్రమే జవాబుదారీతనం స్వీకరిస్తున్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, సమానత్వం లేకుండా కేవలం ప్రకటనలు, ప్రచారాలతో విద్యార్థుల విశ్వాసాన్ని తిరిగి పొందడం సాధ్యం కాదు.

ఒక దేశ భవిష్యత్తు అక్కడి విద్యార్థుల చేతుల్లో ఉంటుంది. అలాంటి విద్యార్థుల జీవితాలను పరీక్షల అవ్యవస్థతో అనిశ్చితిలోకి నెట్టడం అత్యంత ప్రమాదకర విషయం. సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణపై వస్తున్న విమర్శలు కేవలం ఒక బోర్డుపై అసంతృప్తి మాత్రమే కాదు. అవి దేశ విద్యా పరిపాలనలో పెరుగుతున్న సంక్షోభానికి సంకేతం. విద్యను హక్కుగా కాకుండా మార్కెట్ వస్తువుగా మార్చిన విధానాలు, ప్రచార రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చిన పరిపాలనా వైఖరి, ప్రాథమిక సమస్యలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఇవన్నీ కలిసి ఈ పరిస్థితిని తీసుకొచ్చాయి. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వ్యవస్థపై సమాజం ప్రశ్నించాల్సిన సమయం ఇది. లేకపోతే పరీక్షల భయం మాత్రమే కాదు, మొత్తం విద్యా వ్యవస్థపైనే యువత నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉంది.

# బాధ కోపం వద్దు మనోప్రశాంతతే హద్దు

మనిషి మనసు సుఖ దుఃఖాలకు
నిలయం కోపం బాధలకు
భావోద్వేగాలకు వేదిక
మనిషి కష్టాల కడలిని దాటాలి
జీవితంలో సంతోష తీరం చేరాలి
సమస్యలకు స్పందించడం
పరిష్కారాలను వెతకడం
మనిషి మనసు బాధ్యత
గతం అనేది కడలిలోని
అలల వంటిది
అలలు తీరాన్ని తాకడానికి
ఆరాటపడతాయి
నీరురాకముందే నీటికి
కట్టెయ్యాలి రోగాలు రాక
ముందే ఆరోగ్య సూత్రాలు
పాటించాలి
వ్యక్తి గతాన్ని తలిచి వగిచే కన్నా
ప్రస్తుత ప్రగతి శీల కార్యాచరణే
మిన్న నిరాశ వద్దు ఆశయే హద్దు
గతం ఒక పాఠం మాత్రమే
జీవితం కాదు ఆది ఒక కలగానే
భావించాలి భ్రమల్లో జీవించద్దు
నిన్నటి తప్పులను వదిలేయి
నేటి అవకాశాలను అందుకో
నిన్నటి చీకటిని తిడుతూ
కూర్చుంటే నేటి ఉదయం
వెలుగులను ఆస్వాదించలేవు
గతం నీఅనుభవమైతె
ప్రస్తుతం నీ అవకాశమై
నీకు అందుబాటులో
ఉండే వనరులను
వినియోగించుకోవాలి
అనుభవంతో నేర్చుకో
అవకాశంతో గెలుచుకో
కోపపు అలలను ఆపాలి
ఆందోళనల ఆలోచనలు
మానాలి సహనాన్ని పెంచాలి
సౌభ్రాతృత్వ సంస్కృతిని
పెంపొందించాలి
ఓ మనిషి మనసునను
ప్రశాంతంగా ఉంచుకో
కోపం పగ నిప్పు లాంటిది
వాటిని నియంత్రించక పోతే
అవి నిన్ను దహిస్తాయి
బాధలను వదిలేయాలి
బాధ్యతలను పెంచుకోవాలి
భారాలు దించుకోవాలి
దిగులుతో దిక్కులు చూడకు
జీవితంలో బాధల చీకటి తొలగాలి
సుఖాల వెలుగులు రావాలి
గత కాలం బారం బాధలు వీడాలి
కొత్త ఆశలతో ముందుకు సాగాలి
బాధ్యతలు పెనవేసుకొని
ప్రగతియే ధ్యేయంగా
ముందుకు సాగాలి
మనసులోని భారాన్ని దించుకో
మనసును తేలికగా మార్చేయ్
నిన్నటి శూన్యం నేడు ఉండదు
గడచిన కాలం తిరిగి రాదు
గతాన్ని తల్వడం వల్ల లాభం
లేదు నిన్నటి చింతలు మరచిపో
ప్రశాంతత వైపు అడుగులువేయు
సంతోషమేధ్యేయంగా జీవించు
జీవనసాఫల్యతను సాధించు
ధైర్యం ఆత్మవిశ్వాసమే
లక్ష్యంగా క్రియాశీలకంగా
అడుగు ముందుకెయ్యి
విజయం నీవశమౌతుం
ప్రేమతో ఇతరుల
మనసును గెలుచుకో
నీ జీవితాన్ని
నీవే మలుచుకో
నీవు మారు
ఇతరులను మార్చు
సామాజిక మార్పుకు
నీవే అగ్రేసరుడివి కావాలి
జీవితానికి భారంగా మారిన
బాధ కోపం అహం పగ కక్ష
కాఠిన్యతలను వదులుదాం
ప్రశాంతతను జీవితంలోకి
స్వాగతిద్దాం
సంతృప్తి సహనం సంఘీభావం
సంకల్పం సంతోషం సౌభాగ్యమే
సామాజిక సంపదగా విలసిల్లేట్లు
నూతన సామాజిక
వాతావరణాన్ని నిర్మిద్దాం



నేదునూరి కనకయ్య

## ప్రవేట్ పాఠశాలలో ఫీజులు నియంత్రించే బోర్డులు ఏర్పాటు చేయాలి



జనసైన్యం సిటి

బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంఘాలు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేటు పాఠశాలలో నర్సరీ టు టెన్త్ క్లాస్ వరకు ఫీజులు నియంత్రించే బోర్డులు ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ, అనుబంధ సంఘాల నాయకులు దొగ్గలి శ్రీధర్ , నారోజు రాకేష్ చారి , క్రాంతి తో కలిసి ఉన్నత విద్యాధికారిని ఏడి మాధవి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతు అన్ని ప్రైవేటు పాఠశాలలో ఫీజులు నియంత్రించే బోర్డులు ఏర్పాటు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులకు అడ్మిషన్ల ఫీజు , సంవత్సర టర్మ్ ఫీజు చెల్లించే విధాన ప్రక్రియ సులభంగా ఉంటుందని వారు తెలిపారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో అధికారి పార్టీకి చెందిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీ గురించి ప్రస్తావించి దానిని అరికట్టే విధంగా అమలు చేస్తానని హామీ ఇచ్చారని ఉన్నత విద్యాధికారినికి వారు తెలిపారు. ఉన్నత విద్యాధికారిని సానుకూలంగా స్పందిస్తూ ఫీజులు నియంత్రించే బోర్డులను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వానికి లేఖ పంపిస్తామని తెలిపారు. అధికారి పార్టీ కి చెందిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కూడా ప్రభుత్వంతో మాట్లాడి అన్ని ప్రైవేటు పాఠశాలలో ఫీజులు నియంత్రించే బోర్డులు ఏర్పాటు చేయాలని పత్రిక ద్వారా మీకు సమన్వయంగా మనవి చేసుకుంటున్నాము..

# మీకు తరచూ కోపం వస్తోందా?



కత్తి జయలక్ష్మి



మీకు తరచూ కోపం వస్తోందా? అయితే, అది కోపం కాదు, మీ లోపలి గాయం!

మనం రోజూ జీవితంలో ఎన్నో విషయాలకు ఎతీఅస్త్రస్త్రవతీ అవుతుంటాం. ఎవరో ఏదో అన్నారని విపరీతమైన కోపం వస్తుంది, ఎవరో మనల్ని పట్టించుకోలేదని ఆవేదన కలుగుతుంది, ఇంకెవరో మనకంటే ముందుకెళ్లారని అసూయ లేదా అభద్రతాభావం పుట్టుకొస్తుంది.

కానీ ఒక సైకాలజిస్ట్‌గా నేను మీకు చెప్పే ఒక చేదు నిజం ఏంటంటే... మిమ్మల్ని ట్రిగ్గర్ చేసే ఏ విషయమూ బయట లేదు, అది పూర్తిగా మీ లోపలే ఉంది!

ఈ పోస్ట్ తో ఉన్న చిత్రాన్ని ఒక్కసారి నిశితంగా గమనించండి. ఇందులో సైకాలజీకి సంబంధించిన ఒక రహస్యం దాగి ఉంది.

1?? మొదటి ముసుగు (The Frustration)

పైకి మనం చాలా చిరాగ్గా, కఠినంగా కనిపిస్తాం. ఎవరైనా ఏదైనా అంటే చాలు వెంటనే రియాక్ట్ అయిపోతాం.

2?? రెండో ముసుగు (The Aggression)

ఆ చిరాకు కాస్తా తీవ్రమైన కోపంగా, ఆగ్రహంగా మారుతుంది. మనం ప్రపంచానికి చూపించే అతిపెద్ద రక్షణ కవచం (Defense Mechanism) ఈ కోపమే.

3?? మూడో పొర (The Hidden Pain)

కానీ ఆ కోపం అనే ముసుగును తీసి చూస్తే... లోపల తీవ్రమైన బాధ, కన్నీళ్లు, నిస్సహాయత కనిపిస్తాయి. మనం కోపంగా ఉన్నామంటే దాని అర్థం మనం స్ట్రాంగ్ అని కాదు, లోపల తీవ్రంగా నలిగిపోతున్నామని!

4?? అసలు మూలం (The Wounded Inner Child)

అన్నింటికంటే లోపల, ఆ కన్నీళ్ల వెనుక అసలు కారణం దాగి ఉంది. అదే... "గాయపడిన చిన్నారి" (The Wounded Inner Child). ??

అవును, ఈ చిత్రంలో చివరి ఫ్రేమ్‌లో ఒక చిన్న పాప/బాబు ఒంటరిగా, భయంతో ముడుచుకుని కూర్చుని ఉండటం చూశారా? అది మీరే!

ట్రిగ్గర్స్ మనకు ఏం చెప్తున్నాయి?

మీరు దేనికైతే ట్రిగ్గర్ అవుతారో, అది మీ పాత గాయాన్ని తాకుతోంది అని అర్థం.

ఎవరైనా మిమ్మల్ని విమర్శించినప్పుడు మీకు విపరీతంగా కోపం వస్తోందా? అంటే, చిన్నప్పుడు మిమ్మల్ని ఎవరూ సరిగ్గా గుర్తించలేదనే గాయం మీలో ఇంకా మానలేదు.

ఎవరైనా మిమ్మల్ని వదిలేస్తారేమో అని భయం (Abandonment Fear) వేస్తోందా? అంటే, గతంలో మీరు ఒంటరిగా మిగిలిపోయిన బాధ మిమ్మల్ని ఇంకా వెంటాడుతోంది.

ఎదుటివారు మీ మాట వినకపోతే కంట్రోల్ కోల్పోతున్నారా? అంటే, మీ జీవితంపై మీకు పట్టు లేదనే అభద్రతాభావం మీ లోపల దాగి ఉంది.

ఇప్పుడు మీరు చేయాల్సింది ఏంటి? (The Path to Healing)

"ఏది మిమ్మల్ని trigger చేస్తుందో, అక్కడే మీరు ష్ట్రముఖుశ్రీ చేయాల్సింది ఉంది."

ట్రిగ్గర్ అవ్వడం అనేది ఒక శాపం కాదు, అదొక అవకాశం!

మీ శరీరంలో ఎక్కడైనా దెబ్బ తగిలితే, అక్కడ తాకినప్పుడు నొప్పి పుడుతుంది. ఆ నొప్పి ఏం చెప్తుంది? "ఇక్కడ దెబ్బ తగిలింది, మందు రాయి" అని చెప్తుంది. ట్రిగ్గర్స్ కూడా అంతే. మీ మనసులో ఎక్కడ గాయం ఉందో చూపించే అలారమ్స్ అవి.

ఇకపై ఎప్పుడైనా మీకు విపరీతంగా కోపమో, బాధో వస్తే... ఎదుటివారిపై అరవడం ఆపేయండి. ఆ కోపం అనే ముసుగును పక్కన పెట్టి, మీ లోపలికి మీరు తొంగి చూడండి. అక్కడ భయంతో ఏడుస్తున్న మీ Inner Childని గమనించండి. దానికి ప్రేమను, ఓదార్పును ఇవ్వండి.

ఎదుటివారిని మార్చడం మన చేతుల్లో లేదు. కానీ మన లోపలి గాయాన్ని మాన్పడం (Healing) పూర్తిగా మన చేతుల్లోనే ఉంది.

ఈ రోజు నుంచే మీ ట్రిగ్గర్స్‌ని గమనించడం స్టార్ట్ చేయండి. మీ హీలింగ్ జర్నీని ప్రారంభించండి.

మీలో ఏ విషయం ఎక్కువగా ట్రిగ్గర్ అవుతుందో ఆలోచించండి! మీ అభిప్రాయాన్ని పంచుకోండి.

# రన్నింగ్ కాలమ్



పరీక్షల మాటంటేనే
ఒళ్ళంతా దిగులు
ఫలితాలు వస్తుంటే
గుండెల్లో గుబులు

ఫెయిలైతే చావాలని
అనుకుంటే అన్యాయం
తల్లిదండ్రుల ధైర్యమే
పిల్లలపాలిట సాయం

-పెనుగొండ
బసవేశ్వర్..

## పిల్లల ఎదుగుదల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**జనసైన్యం సిటి**

పిల్లల ఎదుగుదల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మండలం లోని అమ్మకపేట అంగన్వాడి పరిధిలో శుక్రవారం ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్ ఆక్టివిటీస్ లో బాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సుపర్ వైజర్ మాట్లాడుతూ ఫస్ట్ వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి వివరించారు.పోషణ ఆరోగ్యము ప్రారంభ అభ్యసనం బాధ్యతమైన సంరక్షణ భద్రత సంరక్షణ శ్రేయస్సు అనే అంశాలను , మొదటి వెయ్యి రోజుల సంరక్షణ అంటే గర్భిణీ అయినప్పటి నుండి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు వెయ్యి రోజులు ఆ వెయ్యి రోజుల ప్రాముఖ్యత, పుట్టగానే మురుపాలు కేవలం తల్లిపాలు ఆరు నెలల లోపు బిడ్డకు తల్లిపాల గురించి చెప్పడం జరిగింది తర్వాత అనుబంధ ఆహారము శిశువు అభివృద్ధి,తల్లిదండ్రులతో పిల్లల సంభాషణ తక్కువ ఖర్చుతోటి లో కాస్ట్ మెటీరియల్ స్థానికంగా లభించే వనరులను ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఆట మరియు అభ్యసన సామాగ్రి ప్రీస్కూల్ సామాగ్రి తయారు చేసే విధానం అదేవిధంగా ఎలా తయారు చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, అంగన్వాడీ టీచర్లు నవనీత ,రామలక్ష్మి ఆశలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరుణ్ కుమార్‌కు ఘన సన్మానం




**జనసైన్యం సిటి**

రెండవసారి కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన కొరివి అరుణ్ కుమార్ ని నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ సన్మాన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పులి అంజనేయులు గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షులు పురం రాజేశం, మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ తాజ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రవణ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు సిరిపురం నాగప్రసాద్, కరీంనగర్ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం లావణ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అబ్దుల్ అమీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి తదితరులు అరుణ్ కుమార్ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, అరుణ్ కుమార్ నాయకత్వంలో జిల్లా ఎస్సీ విభాగం మరింత బలోపేతం అవుతుందని, పార్టీ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని ఆకాంక్షించారు.

## బాల పురస్కార్ అవార్డులకు ఆన్ లైన్ దరఖాస్తులు ఆహ్వానం

**జనసైన్యం సిటి**

మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026-2027 సంవత్సరంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డ్-2026 ( PMRBP) ల కోసం అర్హులైన (5-18) సంవత్సరాల లోపు బాల బాలికలు వివిధ రంగాలలో అనగా ఆవిష్కరణ మరియు సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతిక, కళలు, సాహసం, క్రీడలు, సామాజికసేవ, శాస్త్ర, సాంకేతిక మరియు ఇతర రంగాలలో ప్రతిభ చూపిన బాలలు 31.07.2026 వ తేదీలోగా https://awards.gov.in ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి యం.సరస్వతి గారు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు పూర్తి వివరాల కొరకు పై ఆన్ లైన్ వెబ్ సైట్ లేదా జిల్లా పరిషత్ లోని బాల రక్ష భవన కార్యాలయం, 2వ గేటు, 2వ అంతస్తు లోని డి.సి.పి.యు విభాగం 9490881098 ను సంప్రదించాల్సిందిగా తెలియపరచడమైనది.జిల్లా సంక్షేమ అధికారి,మహిళా, పిల్లల, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ,కరీంనగర్ జిల్లా.

# తల్లిదండ్రులకు పనులు చేసి సంపాదించి పెట్టే బాల కార్మికులు ఎందరో



డా.. కందెపి రాణీప్రసాద్

బాలలు 14 ఏళ్ళలోపు వయసు ఉండి తమ సహజ బాల్యాన్ని అనుభవించకుండా పనుల్లో చేరితే బాల కార్మికులు అనవచ్చు. విద్యను నేర్చుకోవడానికి పాఠశాలకు వెళ్ళే వీలులేకుండా పేదరికంలో ఉన్న తల్లిదండ్రులకు పనులు చేసి సంపాదించి పెట్టే బాల కార్మికులు ఎందరో ఉన్నారు. ఇటుక బట్టీలు క్వారీలు, గనులలో ప్రమాదకర పరిస్థితులలో పని చేస్తూ అక్రమ మార్గాలలో సంపాదించే వారి పరిచయాలు



కావడం వల్ల నేరస్థులు గా మారే ప్రమాదం ఉంది. జీవనోపాధి కోసం రసాయన కర్మాగారాల వంటి ప్రమాద స్థలాలలో పనిచేసే బాల కార్మికుల హక్కులను కాలరాయడం ఒక సామాజిక నేరం. బాలలను మానసికంగా శారీరకంగా, సామాజికంగా, నైతికంగా హాని కలిగించే ఈ పనుల ద్వారా పిల్లలు శ్రమ దోపిడికి గురి అవుతున్నారు. ఈ శ్రమ దోపిడిని గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా బాల కార్మికుల కోసం చట్టం చేశారు. బాల కార్మిక చట్టం వలన పనిలో పెట్టుకున్న యజమానులకు సైతం శిక్షలు వేస్తున్నారు. 19వ, 20వ శతాబ్దాల ప్రారంభంలో పేద కుటుంబాల పిల్లలు చాలా మంది బాల కార్మికులుగా మారిపోతున్నారు.

చాలా మంది బాల బాలికల్లో 70% మంది వ్యవసాయ పనులలో పొలాలలో పని చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని కంకణం కట్టుకున్నారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించబడుతున్నది. దీనికోసం కఠినమైన చట్టాలు అమలు చేస్తున్నారు. 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ద్వారా కూడా సమాచారం అందిస్తున్నారు. పిల్లలందరికీ నిర్బంధ ఉచిత విద్య అమలు చేయడం ద్వారా వారిని పాఠశాలలకు పంపించే వీలుంటుంది. బాల కార్మికులను గుర్తించి వారికి సామాజిక చైతన్యం కలిగించాలి.

విద్యను ప్రధాన ఆయుధంగా గుర్తించారు. చదువు వలననే ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం ద్వారా పిల్లలను పనులకు పంపించకుండా నిరోధించవచ్చు. 14 సం..ల లోపు పిల్లలను ఎటువంటి పనులలోనూ నియమించకూడదు. అలాగే 18 సం..ల లోపు పిల్లలను ప్రమాదకర పనులలో పెట్టకూడదు. కేవలం తల్లిదండ్రులే కాకుండా పనిలో పెట్టుకున్న యజమానులు కూడా శిక్షార్హులవుతారు. ప్రపంచంలోని అత్యంత పేద దేశాలలో నలుగురిలో ఒకరు బాలకార్మికులుగా పని చేస్తున్నారు. మాలి, బెనిన్ వంటి ఆఫ్రికన్ దేశాలలో బాల కార్మికులు ఎక్కువగా పని చేస్తున్నారు. పారిశ్రామిక విప్లవంలో బాల కార్మికులు ముఖ్యమైన పాత్ర పోషించారు. పాడి, మత్స్య అటవీ రంగాలు, రిటైల్, హాకింగ్, రెస్టారెంట్లలో వస్తువులను దింపడం, ఎక్కించడం వంటి పనులు, చెత్తను తీయడం. రీసైక్లింగ్ చేయడం, బూట్లు పాలిష్ చేయడం, ఇంకా గృహ అవసరాలలో చాలా మంది పనిచేస్తున్నారు. బాలికలైతే ఇంటి పనుల్లో సహాయకులుగా పని చేస్తున్నారు. ఇటువంటి అవసరాలతో పాటు గంజాయి, గన్ను, మందు గుండు సామాగ్రి వంటి అక్రమ నిల్వలు, అక్రమ రవాణాలలో బాలల్ని వినియోగిస్తున్నారు. మత్తు పదార్థాల రవాణాలో బాలల్ని ఉపయోగించడం వలన బాలలూ వాటికి బానిసలయ్యే ప్రమాదం పొంచి ఉన్నది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ బాల కార్మిక చట్టాన్ని ఏర్పరచి చాలా దేశాలు సంతకం చేశాయి. ఈ సమావేశంలో బాల కార్మిక చట్టాన్ని 171 దేశాలు ఆమోదించాయి. ఐక్యరాజ్య సమితి 1990 లో పిల్లల హక్కులపై సదస్సును ఏర్పాటు చేసింది. ఆర్థిక శ్రమ దోపిడీ నుండి ప్రమాదకరమైన పనులకు పిల్లలను దూరంగా ఉంచాలని నిర్ధారించాయి. పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించే శారీరక, మానసిక, నైతిక అభివృద్ధికి ఆటంకం కలిగించే బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా సమాజం నుంచి పారద్రోలాలని నిర్ణయించారు. పిల్లలను బలవంతంగా సాయుధ పోరాటాల్లో దించడం, వ్యభిచార గృహాల్లో బంధీలవడం, మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలలో బాలల్ని వినియోగించరాదని హెచ్చరించారు.

పొలాల్లో ఫ్యాక్టరీలలో పనిచేసే బాల కార్మికులను ప్రభుత్వం గుర్తిస్తున్నది కానీ ఇంట్లో తల్లిదండ్రులు ఆటలు ఆడనివ్వకుండా చదువు పేరుతో విపరీతమైన వత్తిడి కలిగించడాన్ని ఎవరు నిషేధించాలి.

కాలేజీలలో, స్కూళ్ళలో హాస్టళ్ళలో ఇరవై నాలుగ్గంటలూ గదుల్లో బంధించి బయటకు రాకుండా వార్డెన్లను నియమించి బలవంతపు చదువు చదివించటం వలన ఆట పాటలకు, స్వచ్ఛమైన బాల్యానికి దూరం అవుతున్నారన్న విషయాన్ని ఎంతమంది గుర్తిస్తున్నారు. హాస్టళ్ళలో రౌడీ పిల్లల మధ్య బిక్కు బిక్కు మంటూ బతికే సున్నిత హృదయులు ఆత్మహత్య చేసుకుంటే ఈ చావులకు కారణం ఎవరు? పిల్లలు అమెరికా వెళ్ళి డాలర్లు సంపాదించాలనే తల్లిదండ్రుల ఆశ కారణమా? నాణ్యమైన విద్య పేరుతో పిల్లలకు ఏ ఆటపాటలూ లేకుండా ప్రతి వారం పరీక్షలు పెడుతూ అందులోని మార్కుల ఆధారంగా సెక్షన్లు మార్చుతూ పిల్లల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే కాలేజీదా తప్పు? ఎవరిదీ పాపం ! ఎవరైనా ఆలోచిస్తున్నారా? పిల్లల హాస్పిటల్ కు మానేజింగ్ డైరెక్టర్ గా అనేక మానసిక సమస్యలతో వచ్చే పిల్లలను ఎంతోమందిని చూశాను. మానసిక విశ్రాంతి లేకుండా చదువు చదువు అని జైలులో బంధించినట్లు హాస్టళ్ళలో బంధిస్తే జైలు కూ, స్కూలుకూ తేడా ఏముంది? ఈనాటి బాలలకు శారీరక శ్రమ ఏ మాత్రం లేదు. తల్లిదండ్రులు, స్కూళ్ళు అలాగే తయారు చేస్తున్నారు. వాస్తవాలు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను.

# రైతు కష్టనష్టాల గుర్తించకుండా, ఉచిత విద్య వైద్యాన్నిహామీ ఇవ్వని ఏ ప్రభుత్వమైనా వృధా!!



వడ్డేపల్లి మల్లేశం

**ధాన్యం కొనుగోలు విషయంలో ఇంత రాద్ధాంతం ? టిఆర్ఎస్ పాలనలో అదే ధోరణి నాడు ప్రతిఘటన తక్కువ నేడు ప్రతిపక్షాల పోరాటం ఎక్కువ అంతే తేడా! రైతు కష్టనష్టాల గుర్తించకుండా, ఉచిత విద్య వైద్యాన్నిహామీ ఇవ్వని ఏ ప్రభుత్వమైనా వృధా!!**

"ఎద్దు ఏడవని ఎవుసం,రైతు ఏడవని రాజ్యం సాధించి తీరాలి అదే నిజమైన పరిపాలన" అని పెద్దలతో పాటు అప్పుడప్పుడు రాజకీయ నాయకులు కూడా కబుర్లు చెబుతూ ఉంటారు. కానీ ఆచరణలో మాత్రం అధికార పక్షం ప్రతిపక్షంలోకి వెళ్లిన ప్రతిపక్షం అధికారంలో కొనసాగిన అదే తంతు, అవే పద్ధతులు, అవే కన్నీరు, పండించిన పంట నేలపాలు కావడంలో మాత్రం తేడా ఇసుమంత కూడా లేదు. ఒక పార్టీ నాయకులు గగ్గోలు పెడితే మరో పార్టీ వాళ్లు కొంత మౌనంగా ఉండవచ్చు నిజంగా తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత క్రమక్రమంగా పంటల దిగుమతి బాగా పెరిగిన క్రమంలో పంటలను కొనుగోలు చేసే సందర్భంలో ఏర్పడిన ఇదే పరిస్థితులు ఆనాడు కూడా తారసపడ్డాయి. కానీ ఆనాడు ప్రతిపక్షంలో బలహీనంగా ఉన్న కాంగ్రెస్ అప్పుడప్పుడే ఎదిగినటువంటి బిజెపి పెద్దగా కత్తి కట్టలేదు కనుక టిఆర్ఎస్ బతికిపోయింది. కానీ ఆనాడు కూడా ఇదే తంతు ఇటీవల రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్న కాలంలో అకాల వర్షాల ప్రభావం ఒకవైపు అరకొర సౌకర్యాలు, గిడ్డంగులు, గన్ని బ్యాగులు, కవర్లు, లారీలు, చివరికి పనివాళ్ళు కూడా అందుబాటులో లేకపోవడం వలన ఎండలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవుతూ అకాల వర్షాలకు కళ్ళముందే కదలాడుతూ కడలిని చేరుతూ ఉంటే ఆ రైతుల దుఃఖం వర్ణనాతీతం. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థలో దాదాపుగా సగభాగాన్ని ఆక్రమించే వ్యవసాయ రంగం పైన ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తూ ఉంటాయి ఈ అన్నింటికీ రైతు భద్రంగా భరోసాగా పంటను పండించి ఇంటికి చేర్చుకున్నప్పుడే కదా చేతిలోకి డబ్బు వచ్చేది. ఇటీవల కాలంలో పంట దిగుబడి మరీ ఎక్కువ కావడం వల్ల కూడా ఏర్పాట్లు లేకపోవడంతో ఎవరికి తోచిన దగ్గర వాళ్లు ఆరబోసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చినప్పటికీ కొంత కాలయాపన, కొంత ప్రభుత్వ నత్తనడక, కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం, చెల్లింపుల అవకతవకలు, వీటికి తోడు అకాల వర్షాలు ముప్పేట దాడి చేస్తుంటే సన్నకారు, చిన్న కారు రైతులతో పాటు పెద్ద రైతులు కూడా ఈ ప్రమాదం బారిన పడక తప్పడం లేదు. ప్రధానంగా పంటల ఉత్పత్తి గణనీయంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఉత్తర ప్రదేశ్ పంజాబ్ లాంటి రాష్ట్రాలతో పోల్చుకున్నప్పుడు ఇటీవల కాలంలో తెలంగాణలో మరీ భారీగా ఉత్పత్తి రావడానికి గమనించవచ్చు. పండుతున్న పంటకు సరిపోయే స్థాయిలో ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది ఆనాడు టీఆర్ఎస్ కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కానీ ఆ ఏర్పాట్లను చేయకుండా విమర్శలను ఖాతరు చేయకుండా విమర్శకు ప్రతి విమర్శ చేస్తూ కొనుగోలు చేస్తున్నామని సగం వరకు అయిపోయినాయని చెల్లింపులు చేస్తున్నామని నమ్మబ లకే ప్రయత్నమే కానీ రైతుల కన్నీటి వరద మాత్రం ఆగడం లేదు. ముఖ్యంగా మార్చి ఏప్రిల్ మాసాలలో దిగుబడి అవుతున్నటువంటి వరి పంట మొక్కజొన్న ఇతర అన్ని రకాల ధాన్యాలు పెద్ద మొత్తంలో మార్కెట్లోకి రావడం దేశ ఆహార అవసరాలను తీర్చే విషయంలో రైతును అభినందించవలసిందే కానీ ఆ స్థాయిలో రైతుకు సమాజం గానీ ప్రభుత్వాలు కానీ భరోసా ఇస్తున్నాయా కన్నీళ్లను తప్ప.

## బాధ్యత మరిచిన ప్రభుత్వాలు:

అత్యంత కీలకమైన పంటల ఉత్పత్తి భద్రతా భరోసా నిలువ పంపిణీ వంటి అంశాల పైన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో దృష్టి సారించాలి. ఉమ్మడిగా ఈ బాధ్యతను శక్తికి మించి నిర్వహించవలసిన అవసరం ఉంటుంది. ఏ రాష్ట్రంలోనైనా అవకతవకలు జరిగినా అమ్మకాలు కొనుగోలు లోపం జరిగిన కచ్చితంగా ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. అందుకు తగిన ఏర్పాట్లను చేసుకోవడం పంట కాలాని కంటే రెండు నెలల ముందే అన్ని ఏర్పాటు చేసుకోవడం అవసరమే కదా! ఆ మాత్రం స్పృహ, అవగాహన లేకుండా ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తూ ఉంటే ఖాతరు చేయకుండా ప్రభుత్వాలు నటిస్తూ ఉంటే మధ్యన రైతులు ఆందోళనకు గురికావాల్సిందేనా? డ్రైనేజీలలో, మురికి కాలువల్లో, పంట కాలువలు, వీధుల్లో నిరంతరం అంతటా వడ్లు ఇతర ధాన్యాలు కొట్టుకొని పోతూ ఉంటే ఇది ఏమైనా ప్రభుత్వమే నా? లేక పిల్లగాళ్ళ ఆటలా?అర్థం కాని పరిస్థితి రైతుల కన్నీరుని కూడా గుర్తించనటువంటి పాలకులు కర్కోటకులే కదా! అదే సందర్భంలో విమర్శిస్తూ ప్రజలు రైతుల పక్షాన నటించినట్లు మభ్యపెట్టి ప్రతిపక్షాలు కూడా ఊక దంపుడు ప్రసంగాలు ప్రెస్మీట్లో మాని ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి రైతులకు వెన్ను ధన్నుగా నిలబడాలి. తమ సామాజిక బాధ్యతను నిర్వహించాలి కానీ ప్రతిపక్షాలది అలాంటి బాధ్యత ఎక్కడా కనిపించదు. టిఆర్ఎస్ హయాంలో కూడా రైతు కల్లాల దగ్గర పడుకున్నటువంటి రైతులు ఎంతోమంది కల్లాల మీదనే చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఆనాడు ఈనాడు ఏనాడైనా రైతుల పరిస్థితి అదే జరుగుతున్నది. ఆనాడు తమ పాలనలో కూడా జరిగినటువంటి మారణకాండను ఆ ప్రభుత్వం అంగీకరించలే ఈ ప్రభుత్వం కూడా అంగీకరించడం లేదు .ఈ అత్యవసరమైన రైతు ధాన్యం సేకరణ విషయాన్ని పక్కనపెట్టి ముఖ్యమంత్రి ఇతర మంత్రులు ప్రభుత్వ అధికారులు ఊహకు అందని అత్యంత దూరంగా ఉన్న అంశాల పట్ల ప్రజల మనసులను డైవర్ట్ చేసే ప్రయత్నం చేస్తూ కాలయాపన చేయడం అవసరమా? ప్రాధాన్యత ఉన్న ముఖ్యమైన అంశాలను కాలాలవారీగా స్వీకరించి ఆ సమస్యలు పరిష్కారమైన తర్వాతనే మిగతా సమస్యలను పట్టించుకోవడం ద్వారా ఇలాంటి ఊకదంపుడు విమర్శలకు ప్రభుత్వాలు గురికాకుండా చూడవచ్చు. మరొకవైపు రైతులను కూడా కాపాడిన పేరు కూడా ఉంటుంది

## ఈ విపత్తు సమాజం బాధ్యత

సరే ఏది ఏమైనా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం పత్రిక ముఖంగా ఎత్తిచూపడం చాలా అవసరం. ఆ పాత్ర పోషిస్తున్నటువంటి ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ప్రజా సంఘాలు టిఆర్ఎస్ లాంటి ఇతర రాజకీయ పార్టీలు ప్రభుత్వంతో అమీతుమీ తేల్చు కోవడానికి సిద్ధపడడాన్ని స్వాగతించవలసిందే. కానీ అది మొక్కుబడి విమర్శగా కాకుండా తమ కాలంలో జరిగినటువంటి నేరాన్ని ఘోరాలను మరణాలను కూడా అంగీకరించి తీరినప్పుడు మాత్రమే భవిష్యత్తులో ఒక స్పష్టమైన విధానాన్ని ప్రభుత్వం ప్రతిపక్షం కలిసి నిర్ణయించడానికి ఆస్కారం ఉంటుంది. " ఏపూట తిన్నారో ఎన్ని పస్తులు ఉన్నాడో కుటుంబ సభ్యులు ఏమైనారు? ఇల్లు ఎవరికి అప్పగించినారో? తెలియదు కానీ కల్లాల దగ్గర తల్లి తండ్రి పిల్లలు నెలల తరబడిగా ఉంటున్నారని వార్తలొస్తున్నాయంటే ఇది ముమ్మాటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యొక్క నేరమే. ఈ చర్యల్లో భాగంగా మృత్యువాత పడినటువంటి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం కట్టించడం కాదు వాళ్ళ మృతికి ప్రభుత్వమే కారణమని అంగీకరించి తీరవలసి ఉంటుంది. " శ్రమను గౌరవించరు, రైతులకు సహకరించరు, అరకొర సౌకర్యాలతో ఆగమాగం చేసి వీధిపాలవుతున్నటువంటి రైతుల జీవితాలకు సార్థకత ఉండాలంటే కచ్చితంగా ప్రభుత్వాలకు ఒక స్పష్టమైన విధానం అవసరం. ఆ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ముందుగా అఖిలపక్షాలతో సమావేశమై స్పష్టమైన విధానాన్ని రూపకల్పన చేసి భవిష్యత్తులో ఒక్క గింజ తడవకుండా ఒక్క వ్యక్తి కూడా నేలరాలకుండా పండించిన పంట మొత్తానికి భద్రత భరోసా నగదు చెల్లింపు సక్రమంగా అయ్యేలా చూడకపోతే ఇప్పటికే అక్కడ క్కడ రైతులు పోరాటాలను ఉధృతం చేస్తున్నారు. ఆవేషం, ఆందోళనతో, బాధతో, రోషంతో ఉన్న రైతులు ఏదైనా చేయగలరు. ఎంతకైనా తెగించగలరు. ఆ అవగాహన బాధ్యత ప్రభుత్వాలకు ఇప్పటికైనా రావాల్సిన అవసరం చాలా ఉంది. " పిడికెడు గింజలు ఆ రూపానికి రావడానికి రైతు ఎంత కష్టపడుతున్నాడో ఊహిస్తే కదా అర్థం అయ్యేది కానీ కిలోల కొద్దీ బియ్యం ఇతర ధాన్యం ఆహార పదార్థాలు హోటలలో ప్రతిరోజు వృధా అవుతూ డ్రైనేజీ పాలు అవుతున్న విషయాన్ని కూడా గమనించినప్పుడు రైతు కష్టానికి సరైన విలువ ఇవ్వడం లేదని అర్థమవుతుంది. డిగ్నిటీ ఆఫ్ లేబర్ మనకు ఉండాల్సిన అవసరం ఉంది. పని ఔన్నత్యాన్ని గుర్తించగలిగే సమాజం ఆవిష్కరించగలిగినప్పుడు మాత్రమే రైతుల సకల కష్టాలు పరిష్కారం అవుతాయి. ముందుగా డిగ్నిటీ ఆఫ్ లేబర్ పాలకులకు ఉండాలి.

మూసి ప్రక్షాళన, ఇతర ఆదర్శ సిటీల పేరుతో వేలాది ఎకరాలను నమ్మబలికే ప్రయత్నం చేసి ఆడంబరాలలో ఊరేగడం కాదు కనీసం ఇల్లు లేని లక్షలాదిమంది శ్రమజీవులకు ముఖ్యంగా హైదరాబాదులో అర గుంట అయినా కేటాయించి సొంత ఇల్లు నిర్మించగలిగే సంస్కారానికి ప్రభుత్వం ఏనాడైతే పాల్పడుతుందో ఆ ఆనాడు ప్రజలకు ఇచ్చినటువంటి వందలాది హామీల అవసరమే లేదు. విద్య వైద్యాన్ని చాలెంజ్గా ప్రకటన చేసి ప్రజల రుణాన్ని తీర్చుకున్నదే నిజమైన ప్రభుత్వమౌతుంది.








# ప్రతి యూనిట్ కు లెక్క కట్టాల్సిందే



**జనసైన్యం సిటి**

వేసవి కాలం లో ఎండలు దంచికొడుతుండటం తో వేసవి తాపనికి జిల్లాలో విద్యుత్ వాడకం బారిగ పెరిగింది. ఉదయం 9 గంటల నుంచే భానుడు విశ్వరూపం ప్రదర్శిస్తుండటంతో వేడి, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. ఫలితంగా 200 యూనిట్లు దాటడంతో గృహజ్యోతి పథకానికి అనర్హులుగా మారుతున్నారు. జిల్లాలో ఫిబ్రవరి,మార్చి,ఎప్రిల్ ,మే నెలలో గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గింది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించినవారు ఎక్కువగా విద్యుత్ వినియోగించటంతో అనర్హులుగా మారారు. కాగా కేవలం రోజుల వ్యవధిలో వేలది మంది లబ్ధిదారులు గృహజ్యోతి పథకానికి అనర్హులుగా మారారు.

మే లో మరింత మంది...

జిల్లాలో గృహజ్యోతి (ఉచిత) విద్యుత్ పథకానికి లక్షల మంది అర్హులు ఉన్నారు. చాల మంది అనర్హులుగా మిగిలారు. ఏప్రిల్, మేలో వీరి సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండగా, మున్ముందు ఎండలు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో విద్యుత్ వినియోగం పెరిగి లబ్ధిదారుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. గృహజ్యోతి పథకం ద్వారా పేదలకు ప్రభుత్వం ప్రతీ నెల 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తోంది. కాగా 201 యూనిట్ల విద్యుత్ కాల్చినా, రూ. 1,200 నుంచి రూ.1,300 వరకు బిల్లు చెల్లించాల్సిందే. ఈ విద్యుత్ వాడకంలో 50 యూనిట్ల వరకు ఒక్క లెక్క, 100 వరకు మరో లెక్క ఆపైనా మరో విధంగా యూనిట్లకు లెక్కలు కట్టాల్సి ఉంటుందని సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు.

గ్రామలలో సైతం పెరిగిన ఎసిలు...

వేసవి కాలం లో బారిగ పెరుగుతున్న ఉష్ణోగ్రతల తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నరు.పటణలలో మరింత ఉష్ణోగ్రతలు ఉండటం తో ఎసిలు,కులర్ లు అదికంగా వాడకం జరిగేవి. కాని గ్రామలలో సైతం ఉరికో 50 ఎసిలు,వందల సంఖ్యలో కులర్లు వాడకం తో గృహజ్యోతి లబ్ధిదారుల లెక్క తప్పుతోంది 200 పైగ యునిట్లు వాడకం తో బిల్లులు చెల్లించక తప్పటం లేదు.



విధ్యుత్ అదా చెయ్యాలి అవసరం మేరకే వాడాలి
మధుసుదన్ విధ్యుత్ డివిజన్ అదికారి (మెట్ పల్లి)

విద్యుత్ అవసరం మేరకు మాత్రమే వాడాలి. రాత్రి వేళల్లో అవసరం ఉన్నప్పుడు మాత్రమే బల్బులు, ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు ఆన్ చేయాలి. అవసరం లేకున్నా కొందరు బల్బులను రూముల్లో వేసి ఉంచుతారు. దీంతో విధ్యుత్ వినియోగం పెరిగిపోయి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి నష్టపోవాల్సి వస్తోంది. ఫలితంగా నెలకు రూ. 1,200 నుండి రూ. 1,300 వరకు బిల్లులను చెల్లించాల్సి వస్తోంది.వినియోగదారులు వినియెగం తగ్గించాలి.

# కాంగ్రెస్ పార్టీ ది రైతు సంక్షేమ ప్రభుత్వం



**సిద్ధిపేట జనసైన్యం**

కాంగ్రెస్ పార్టీ ది రైతు సంక్షేమ ప్రభుత్వం అని ప్రతి ధాన్యం గింజను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అని రైతులు ఎవరు ఆందోళన పడవద్దు అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ అకాల వర్షం వల్ల రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చిన పంట తడిసి పోతే వారికి అండగా ఉండాలి కానీ కావాలని రైతులను అడ్డం పెట్టుకుని బిఆరెస్ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నరు అని మండిపడ్డారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు అని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం అభివృద్ధిని చూసి బిఆరెస్ పార్టీ నాయకులు ఓర్వడం లేదు అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిఆరెస్ పార్టీ కనుమరుగు అవుతుంది అని ప్రజలు బిఆరెస్ పార్టీని ఎక్కడ మరిచిపోతారు అని తమ ఉనికి కాపాడుకునేందుకు నీచమైన రాజకీయాలు చేస్తున్నారు అని అన్నారు. ఉదయం అయ్యింది అంటే చాలు కొందరు బిఆరెస్ పార్టీ చెంచాగిరి చేసే నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని విమర్శించడం పనిగా పెట్టుకున్నారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంను విమర్శించే అర్హత స్థాయి పాల సాయిరాంకు లేదు అని స్థాయికి తగ్గట్టు మాట్లాడితే బాగుంటుంది అని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విజన్ ఉన్న నాయకుడు అని ఆయన నాయకత్వంలో అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు అని అన్నారు. బిఆరెస్ పార్టీ నాయకులు వచ్చే ఎన్నికల్లో అధికారం లోకి రావడం కోసం ప్రజలను రైతులను రెచ్చగొడుతున్నది అని అన్నారు. మీరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా మీ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు అని అన్నారు. సెంటిమెంటును అడ్డం పెట్టుకున్న కెసిఆర్ 10 సంవత్సరాలు ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేశారు అని అన్నారు. బిఆరెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులను మోసం చేసి ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ మరోసారి ప్రజలను మోసం చేసేలా నాటకాలు డ్రామాలు చేస్తున్నారు అని అన్నారు. రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర బిఆరెస్ ది అయితే రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దక్కుతుంది అని అన్నారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే బిఆరెస్ పార్టీ నాయకుల తాట తీస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో , గ్యాదారి మధు గాయాజుద్దీన్ హర్షద్ హుస్సేన్. రాజిరెడ్డి ఫయాజ్ రవితేజ నాని తదితరులు పాల్గొన్నారు..

# గురుకులాలలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నాలను మానుకోవాలి



**జనసైన్యం సిటి**

రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని భారత్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర నాయకులు విజయ్ డిమాండ్ చేశారు.మహాత్మా జ్యోతి బాపూలే గురుకులాల నాన్ టీచింగ్ స్టాఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం శుక్రవారం రోజున కరీంనగర్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత 2017 సంవత్సరం నుండి స్వీపింగ్, హౌస్ కీపింగ్,సెక్యూరిటీ,శానిటేషన్ తదితర విభాగాల్లో సేవలు అందిస్తున్న కార్మికులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కాంట్రాక్టర్లకు టెండర్ ఇవ్వడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.గురుకుల విద్యాసంస్థలు సక్రమంగా నడవడంలో నాన్ టీచింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికులను ఒక్కసారిగా విధుల నుండి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు.. సమావేశముఖ్య అతిథి బి ఎం ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు నిరుద్యోగ నిర్మూలన,యువతకు ఉద్యోగాల కల్పన గురించి మాట్లాడుతూనే,మరోవైపు ఇప్పటికే పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగాలను తొలగించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాలు,ఈఎస్ఐ,పీఎఫ్ వంటి హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.వెంటనే తొలగింపుల నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బి ఎం ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రావణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ నాయకులు మెండే శివశంకర్,అంజన్న,సుజాత,నిర్మల,భాగ్యగురుకుల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**జనసైన్యం సిటి**



నగరపాలక సంస్థ పరిధిలో రూ.7 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి తనిఖీ చేసిన ఆయన, పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నూతన గ్రంథాలయం విద్యార్థులు, యువత మరియు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడే విధంగా ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నట్లు మేయర్ తెలిపారు. నగర ప్రజలకు విజ్ఞాన కేంద్రంగా ఈ గ్రంథాలయం నిలవాలని ఆకాంక్షించారు.భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి దశలో ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురానుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రబుల్ దేశాయ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాక్యలు చేస్తే ఖబర్దార్




**జనసైన్యం సిటి**

హుస్నాబాద్ నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ తగరపు శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రొఫెసర్లు, మేధావుల మరియు విశ్లేషకుల ముసుగులో ప్రొఫెసర్ నాగేశ్వర్ మరియు కొంతమంది వ్యక్తులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పైన ఉద్దేశపూర్వకంగా ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ, చేస్తున్న వ్యక్తిగత ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. కి కూడా పవన్ కళ్యాణ్ తెలంగాణా ప్రస్థావన వచ్చినప్పుడల్లా ఆంధ్రావాళ్ళు ఎంతో నేర్చుకోవాలని, వారిలో ఉన్న పోరాట పటిమ గురించి, అనేక సమావేశాల్లో ప్రస్తావించడం జరిగిందన్నారు. గద్దర్ అన్న అంటే ఎంతో గౌరవమని, తెలంగాణా భావాలు అంటే గౌరవమని, అనేక సందర్భాల్లో ఆయన గురించి ప్రస్తావించేవారని, గద్దర్ కూడా తమ్ముడు పవన్ కళ్యాణ్ అంటూ ఆప్యాయతగా పలకరించే వారని అన్నారు. హైదరాబాద్ వరదల సమయంలో కూడా పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు అండగా నిలుస్తూ 1 కోటి విరాళం, కరోనా సమయంలో కూడా తెలంగాణ ప్రభుత్వానికి 50లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారని అన్నారు. ఇటీవల కొండగట్టు అంజన్న దేవస్థానం అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ద్వారా రూ. 35.19 కోట్లను మంజూరు చేయించారని అన్నారు. ఒక్క రూపాయి కూడా ఏనాడు, ఎవరికీ సాయం చేయని వ్యక్తులు ఆయన గురించి మాట్లాడం సిగ్గుచేటు అన్నారు. అధినేతని హైదరాబాద్ అడుగు పెట్టనీయమని మాట్లాడుతున్న వ్యక్తులారా, జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డ మీదనేనని, ఆయన్ని ఆపే దమ్ము ఎవరికీ లేదని గుర్తు చేసారు. మేము పుట్టింది తెలంగాణ గడ్డమీదేనని, వ్యక్తిగతంగా మాట్లాడగలమని, మా నాయకుడు మాకు సంస్కారం, ఓర్పుని నేర్పించాడని, మీలాగా దిగజారి మాట్లాడలేమని అన్నారు. ఇలాంటి విద్వేషాలు రెచ్చగొట్టేవారు సిగ్గుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జేరిపోతుల సంజీవ్, చిగురుమామిడి మండల ఇంచార్జ్ చిట్యాల సూరజ్, గంగారపు శ్రీకాంత్, కోడెం శ్రీకర్, అంబటి శ్రీకాంత్, తరిగొప్పుల సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరి కొయ్యలు కాల్చవద్దు మంటలార్పి రైతుకు అవగాహన కల్పించిన ఎస్సై



**జనసైన్యం సిటి**

అక్కన్నపేట మండలం అంతక్‌పేట గ్రామ పరిధిలో శుక్రవారం ఓ రైతు రోడ్డు పక్కన వరి కొయ్యలు కాలుస్తుండగా గమనించిన అక్కన్నపేట ఎస్సై చాతరాజు ప్రశాంత్ వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణానికి హాని కలగడంతో పాటు భూసారం తగ్గిపోతుందని తెలిపారు. అలాగే వానపాములు, ఇతర జీవులు నశించి భూమి సారవంతత దెబ్బతింటుందని రైతులకు అవగాహన కల్పించారు. కొయ్యలను కాల్చకుండా పంట అవశేషాలను భూమిలో కలిపితే భూసారం పెరిగి పంట దిగుబడులు మెరుగుపడతాయని సూచించారు.

అనంతరం మండుతున్న మంటలను చెట్టు కొమ్మల సహాయంతో ఎస్సై ప్రశాంత్ స్వయంగా ఆర్పారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని ఆయన కోరారు.

## 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు

## ‘వరిపల్లి అనిల్ కుమార్’కు ఆహ్వానం!

**జనసైన్యం సిటి**



అంకితభావం, పట్టుదల ఉంటే మారుమూల గ్రామం నుండి అయినా ప్రపంచ స్థాయికి ఎదగవచ్చని నిరూపిస్తున్నారు మహబూబాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ యువ నాయకుడు, రచయిత వరిపల్లి అనిల్ కుమార్. తెలుగు భాష, సాహిత్యంపై ఆయనకున్న మక్కువ నేడు ఆయనను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ వేదికపై నిలబెట్టింది.

వచ్చే నెల జూన్ 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా వైభవంగా జరగనున్న “7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల”కు అనిల్ కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. అంతర్జాతీయ వేదికపై మహబూబాబాద్ ముద్ర!చైతన్య సారస్వత పరిషత్ సౌజన్యంతో, అంతర్జాతీయ సాహిత్య సంస్థ “శ్రీశ్రీ కళావేదిక” ఆధ్వర్యంలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నారు. దేశ విదేశాల నుండి ప్రముఖ కవులు, రచయితలు తరలివచ్చే ఈ మహాసంగమంలో.. మహబూబాబాద్ జిల్లా నుండి వరిపల్లి అనిల్ కుమార్ ప్రాతినిధ్యం వహించడం మన ప్రాంతానికే గర్వకారణం.

తెలుగు భాషా కీర్తిని చాటేందుకే..

చైతన్య సారస్వత పరిషత్ అధ్యక్షులు శ్రీ కె.వి.వి. సత్యనారాయణరాజు (శ్రీ చైతన్యరాజు) సౌజన్యంతో, సాహిత్య భూషణ్ శ్రీ కత్తిమండ ప్రతాప్‌కుమార్ సారథ్యంలో ఈ సభలు జరగనున్నాయి. “తెలుగు కేవలం భాష కాదు.. అది ఒక జాతి సంస్కృతి” అనే సంకల్పంతో జరుగుతున్న ఈ ఉత్సవంలో పాల్గొనాల్సిందిగా శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు అనిల్ కుమార్‌ను సాదరంగా ఆహ్వానించారు.ఒక మారుమూల గ్రామం నుండి ప్రస్థానాన్ని ప్రారంభించి, ప్రపంచ వేదికపై మెరవబోతున్న యువ నాయకుడు,రచయిత వరిపల్లి అనిల్ కుమార్ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ప్రజలు, యువత మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారు.

# ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి.




భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ చొప్పదండి మండల ముఖ్య సమావేశం మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో సరిపడా స్కావెంజర్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా నెలపొంది. అదేవిధంగా చాలా పాఠశాలలో వంటగదిలేని పరిస్థితి ఉంది. కావున ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కరించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా చొప్పదండి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల కనీసం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి మండల కేంద్రంలో కనిపిస్తుంది. కళాశాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు విద్యార్థులు కాలి నడకన నడుస్తున్న పరిస్థితి ఉంది. కావున తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని చెప్పి విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో తక్కువ నిధులు కేటాయిస్తూ విద్యారంగాన్ని పూర్తిగా కూని చేసే పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో కనిపిస్తుంది కావున ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి 30% నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. గురుకులాలలో అనేక సమస్యలు వలయంగా ఉన్నాయి అద్దె భవనాలలో అరకుర వసతులతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా కనిపిస్తుంది. గురుకులాలకు సొంత బోనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేయడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో నాయకులు మణికంఠ, శివునికిల్, శేఖర్, శ్రీ హర్ష ,అక్షయ్, వినయ్, మనీ, నవదీప్

# ప్రతి వరి గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది




పెద్దపల్లి జిల్లా మంథని లోని వ్యవసాయ మార్కెట్ యార్డును రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు. సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..... రైతులకు సంబంధించిన ప్రతి వరి గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంద అన్నారు. వర్షాలు చెప్పి రావు కానీ ప్రతిపక్ష నాయకులకు చెప్పి వస్తున్నాయేమో వర్షాలు. రైతుల పై రాజకీయం చేస్తున్నారని ఎద్దేవ చేశారు. ఇప్పటికే అధిక సంఖ్యలో రైతులకు వరి పంట వచ్చిందని ప్రభుత్వం వెంట వెంటనే కొనుగోలు చేసిందన్నారు. రైతులు అధైర్య పడవద్దు ఆందోళన చెందవద్దు...ప్రభుత్వ గోదాములు సరిపోకపోతే ప్రైవేట్ గోదాములు ఉపయోగిస్తాం .తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేస్తాం .బిజెపి – బీఆర్ఎస్ పార్టీలకు రైతుల గురించి మాట్లాడే హక్కు లేదు.కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయం అంటే పండుగ. వరి పంట వేయకూడదనిలో సామాజిక మద్యమాలలో వస్తున్న వార్తలకు ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. వాణిజ్య పంటలు పండించడం ద్వారా రైతులకు అధిక లాభం వస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.రైతులు పొలాలలో వరి కొయ్యలను గడ్డిని కాల్చడం వలన కాలుష్యం ఏర్పడుతుంది, ఇతర రైతులకు ఇబ్బందులు కలుగుతుంది, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# సామల శ్రీనివాస్ ను పరామర్శించిన కవ్వంపల్లి




హైదరాబాద్– పంజాగుట్టలోని సువిధ హాస్పిటల్ రీహాబిలిటేషన్ సెంటర్ లో చికిత్స పొందుతున్న శంకరపట్నం మండల కేంద్రానికి చెందిన సామల శ్రీనివాస్ ను శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్, డాక్టర్ సెల్ అడ్వయిజర్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు.ఇటీవల విధులు ముగించుకొని బైక్ పై ఎరడపల్లి మీదుగా కేశవపట్నం వెళుతుండగా జరిగిన ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలై హైదరాబాద్ లో చికిత్స పొందుతున్నారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ కు సంబంధించిన వైద్య నివేదికలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు, మాజీ జెడ్పీసీ బత్తిని శ్రీనివాస్, శంకరపట్నం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, హనుమంతు తదితరులు ఉన్నారు.